
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 14 । జూన్ । 2025



రూ.లక్ష విరాళం
సామర్లకోట: పంచారామ క్షేత్రంలో నిత్యాన్నదాన పథకానికి వస్తుల సత్య సూర్యనారాయణ, రత్నలీల దంపతులు (సామర్లకోట) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



అయినవిల్లిలో..
అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పసుపులేటి సుజాత (సికింద్రాబాద్) శుక్రవారం రూ.101,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 250, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 15,761 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.95 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

'తల్లికి వందనం'లో కోతలు వద్దు
సీపీఐ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన తల్లికి వందనం పథకాన్ని ఏడాది తర్వాత అమలు చేస్తున్నా నిబంధనల పేరుతో కోతలు విధించడం తగదని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు పేర్కొన్నారు. పథకానికి అర్హులైన తల్లులు అందరికీ నిబంధనలు సడలించి డబ్బు జమ చేయాలని సూచించారు. ఈ మేరకు వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే అడ్డగోలు నిబంధనలతో దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో రూ.2.50 లక్షలు, పట్టణాల్లో రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ తల్లికి వందనం పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకం కింద తల్లులకు రూ.15 వేలు చెల్లిస్తామని చెప్పి ఇప్పుడు అందులో రూ.2 వేలు కోత విధించడం సరికాదన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్న కుటుంబంలోని విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయింపు ఇవ్వడం హామీ ఉల్లంఘనలోకే వస్తుందన్నారు.

20న హుండీల లెక్కింపు
సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో ఈ నెల 20వ తేదీన స్వామివారి హుండీల లెక్కింపునకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ యంకేటీఎన్‌వీ ప్రసాద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎండోమెంట్స్ అధికారుల సమక్షంలో ఆలయ ప్రధాన హుండీలతో పాటు, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీని ఆ రోజు తెరిచి లెక్కింపు చేపడతామన్నారు.


22న శాంతి కల్యాణం

ఈ నెల 22వ తేదీన బహుళ ద్వాదశి రోజున ఉదయం 10 గంటలకు లక్ష్మీనరసింహస్వామివారి శాంతి కల్యాణం నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. కల్యాణం టికెట్లు ముందస్తు బుకింగ్‌ను దేవస్థానం వెబ్‌సైట్ ద్వారాను, ఆలయం వద్ద గల కౌంటర్‌లో భక్తులు తీసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.

సుప్రీం తీర్పు అధికారులకు కనువిప్పు కావాలి


గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో కూటమి ప్రభుత్వ సంస్థలకు, అధికారులకు కనువిప్పు కలగాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మలికిపురంలో మీడియాతో మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో నడుస్తున్న కూటమి ప్రభుత్వంలో నాయకుల అడుగులకు అధికారులు మడుగులొత్తుతున్నారని పేర్కొన్నారు. అటువంటి వారికి సుప్రీం వ్యాఖ్యలు చెంపపెట్టు అన్నారు. ఒక డిబేట్‌లో ఎవరి పాత్ర ఎంత వరకూ ఉంటుందో తెలియకుండా అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. యాంకర్‌లను సైతం దోషులను చేయాలని చూడడం విడ్డూరమన్నారు. మాజీ సీఎం జగన్‌ను, ఆయన భార్య భారతిని సైతం ఈ వివాదంలోకి లాగాలని చూడడం కూటమి నేతల క్రూర రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. కూటమి హయాంలో ప్రభుత్వం వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు మంగళం పాడి ప్రతిపక్షాలపై కక్ష సాధించాలనుకోవడం కూటమికే చెల్లిందన్నారు. డైవర్షన్ రాజకీయాలకు పాల్పడడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. సమావేశంలో కూనపెడ్డి రాంబాబు, కట్టా శ్రీనివాసరావు, అడబాల జానకీరామ్ పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న అన్నదాన భవనానికి విరాళాలు


దాత శశికుమార్ దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వకుళమాత అన్న ప్రసాద భవనం నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా అమలాపురానికి చెందిన వరదా శశికుమార్, సూర్య నాగ వెంకట అమృత దంపతులు రూ.1,01,116, విజయవాడకు చెందిన పచ్చిపులుసు రామకృష్ణ, లీలా శ్రీనిర్మలాకుమారి దంపతులు రూ.51,116, కాకినాడ రూరల్ మండలం కరప గ్రామానికి చెందిన గొర్రెల సాయి వెంకట వంశీ, వారి కుటుంబ సభ్యులు రూ 50,116, విరాళంగా సమర్పించారు. వారికి ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

వేటకు వేళాయె

- నేటి నుంచి సముద్ర వేటకు సిద్ధమవుతున్న గంగపుత్రులు
- 61 రోజుల తరువాత మళ్లీ సముద్రంలోకి..
- ఏప్రిల్ 15వ తేదీ నుంచి కోనసీమ జిల్లాలో ఆగిన వేట
- జిల్లాలోని ఏడు మండలాల్లో 45 మత్స్యకార గ్రామాలు
- 1,700 బోట్లపై 10 వేల మంది మత్స్యకారుల వేట
- కూటమి ప్రభుత్వంలో తొలి ఏడాది పరిహారం ఎగవేత... ఈ ఏడాది కోత



ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం వద్ద సముద్ర వేట (ఫైల్)

సాక్షి, అమలాపురం: సముద్ర వేటకు సమయం ఆసన్నమైంది. రెండు నెలల వేట విరామానికి శనివారం అర్ధరాత్రి నుంచి తెర పడనుంది. వందలాది మంది మత్స్యకారులు వేటకు సిద్ధమవుతున్నారు. వేలాది మంది మాంసం ప్రియులు సముద్ర ఉత్పత్తుల కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. అరవై రోజుల తరువాత వేటకు గంగ పుత్రులు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వేట నిషేధ సమయంలో ఇచ్చే పరిహారం గత ఏడాది ఎగవేయడం, ఈ ఏడాది కొంత కోత పెట్టడంతో వారిని అసంతృప్తికి గురి చేసింది.

కోనసీమ జిల్లాలో సముద్ర వేట ఏప్రిల్ 15వ తేదీ అర్ధరాత్రి నుంచి నిలిచిపోయిన విషయం తెలిసిందే. జిల్లాలో సుమారు 1,700 బోట్లతో స్థానిక మత్స్యకారులు వేటాడుతున్నారు. వీటి మీద పదివేల మంది వరకు మత్స్యకారులు ఉంటారని మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు. ఏడు మండలాలలో 45 తీరప్రాంత గ్రామాలు ఉన్నాయి. వీటిలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం, అల్లవరం మండలం ఓడలరేవు, నక్కా రామేశ్వరం, మామిడికుదురు మండలం కరవాక, ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, ఎస్.యానాం, కాట్రేనికోన మండలం చిర్రయానాం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, భైరవపాలెం, గాడిమొగ గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఎక్కువగా సముద్ర వేటకు వెళతారు.

61 రోజుల పాటు నిషేధం

చేపలు పునరుత్పత్తి (గుడ్లు పొదిగి పిల్లలు తయారయ్యే సమయం) జరిగే సమయంలో చేపల వేట సాగిస్తే మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు దేశంలో కన్యాకుమారి నుంచి కోల్‌కతా వరకు కేంద్ర ప్రభుత్వం వేటను నిషేధించింది. చేపల పునరుత్పత్తికి ఇదే అదను. ఈ సమయంలో వేట జరిగితే గుడ్లతో ఉన్న చేపలు బలవుతాయి. గతంలో అంగుళం, అర అంగుళం వలలతో వేట ఆడేవారు. చిన్న చేపలు తప్పించుకునేవి. కాని ఇటీవల రింగు వలలు (సూక్ష్మ కన్నాలు ఉండే వల) వాడుతున్నారు. దీనివల్ల చిన్నచేప తప్పించుకునే అవకాశం ఉండడం లేదు. దీనిని నిషేధించినా వాడుతూనే ఉన్నారు. దీనివల్ల పర్యావరణానికి సైతం ముప్పు అంటున్నా వీడడం లేదు. చేపల పునరుత్పత్తి సమయంలో వేట నిషేధం ద్వారా మత్స్య సంపద పెరిగే అవకాశం ఉంటుందని నిపుణుల సూచించిన ప్రకారం మత్స్య క్రమబద్ధీకరణ చట్టాన్ని రూపొందించారు.

పలు శాఖల నిఘా

నిషేధ సమయంలో వేట జరగకుండా పలు శాఖలు నిఘా పెడుతున్నాయి. కోస్టు గార్డు, మెరైన్, నేవీ, మత్స్యశాఖలతోపాటు స్థానిక పోలీసులు కూడా వేటను అడ్డుకుంటున్నారు. నిషేధ సమయంలో ఎవరైనా చేపల వేట సాగిస్తే వారికి రూ.2,500 వరకు జరిమానా విధించడంతో పాటు బోట్లను సీజ్ చేస్తారు, సంప్రదాయ పద్ధతిలో ఇంజిన్లు లేకుండా వేట సాగించే మత్స్యకారులకు మాత్రం ఈ నిషేధం వర్తించదు.



కాట్రేనికోన మండలం బలుసుతిప్ప వద్ద సముద్ర వేటకు బోట్లు సిద్ధం

పెరిగిన డిమాండ్

సముద్ర వేట నిషేధం కారణంగా గోదావరి చేపకు ఇప్పటి వరకు మంచి డిమాండ్ వచ్చింది. ఈ కారణంగా గోదావరి, సముద్ర తీరం కలిసేచోట ఉప్పునీటిలో దొరికే చేపలు, రొయ్యలకు రెండు నెలలుగా డిమాండ్ కొనసాగింది. గోదావరి పాయల్లో దొరికే పండుగప్ప, కొయ్యింగలకు డిమాండ్ పెరిగింది.

వినాయక చవితి తరువాతనే వలస మత్స్యకారుల రాక

స్థానిక మత్స్యకారుల కన్నా విశాఖ జిల్లా నక్కపల్లి ప్రాంతాల నుంచి వచ్చే వలస మత్స్యకారుల వేట అధికంగా ఉంటుంది. జిల్లాలో కాట్రేనికోన మండలం పల్లం, చిర్రయానాం, ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, అల్లవరం మండలం నక్కా రామేశ్వరం, మలికిపురం మండలం తూర్పుపాలెం వద్ద సముద్రతీరం గట్టు మీద పదుల సంఖ్యలో గుడిసెలు వేసుకుని వలస మత్స్యకారులు జీవనం సాగించడంతోపాటు వేట చేస్తుంటారు. విలువైన మత్స్య సంపదకు జిల్లాలోని తీరం వీరికి అక్షయ పాత్రలాంటిది. గోదావరి నదీపాయలతోపాటు ప్రధాన మురుగునీటి కాలువలు, మొగల ద్వారా చేపలు సముద్రంలో కలుస్తాయి. సముద్ర ఉప్పునీటిలో మొగల ద్వారా చప్పనీరు వివిధ మార్గాల ద్వారా పెద్ద ఎత్తున చేరడం వల్ల ఈ తీరంలో మత్స్యసంపద అధికంగా దొరుకుతోంది. నక్కపల్లి తీరం కన్నా కోనసీమ తీరంలోనే మత్స్య సంపద అధికంగా దొరుకుతోందని వీరు చెబుతుంటారు. అత్యంత ఖరీదైన 'కచ్చిడి చేప'లు కూడా దొరుకుతాయి. కచ్చిడి చేప ఖరీదు రూ.75 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది. వినాయక చవితి తరువాత వచ్చే వీరు ఏప్రిల్ వేట నిషేధం వరకు తీరంలోనే నివాసముంటారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ పశుసంవర్ధక, ఉద్యాన నరేగా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తుల ద్వారా ప్రజల జీవన ప్రమాణాల మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నరేగా అనుసంధానంతో కాలువ గట్ల అభివృద్ధి చేసి కూరగాయల సాగును ప్రోత్సహించి, పశుగ్రాసం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, ఉద్యాన అధికారి బీవీ రమణ, డ్వామా పీడీ మధుసూదన్, పశు సంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, ఎల్‌డీఎం కేశవ వర్మ పాల్గొన్నారు.

యువత, మహిళలను ప్రోత్సహించాలి

పారిశ్రామికవేత్తలుగా యువత, మహిళలను ప్రోత్సహించాలని కలెక్టర్ మహేష్ కుమార్ కమిటీ సభ్యులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి 15వ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ ద్వారా 4వ500 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు 687 మందికి యూనిట్లు బ్యాంకర్ల సహకారంతో గ్రౌండింగ్ చేసినట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

కోనసీమలో పెట్రో ఎనర్జీ యూనివర్శిటీ నెలకొల్పాలి
ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్

అమలాపురం టౌన్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో ఎనర్జీ యూనివర్శిటీని చమురు, సహజ వాయువుల పరంగా వనరులు అధికంగా ఉన్న కోనసీమలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు డిమాండ్ చేశారు. అమలాపురంలో తన క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పదేళ్ల కిందట పెట్రో ఎనర్జీ యూనివర్శిటీ కోసం అనకాపల్లి జిల్లా ఎంగిలి గ్రామంలో 200 ఎకరాల స్థల సేకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రూ.వెయ్యి కోట్లతో నెలకొల్పనున్న ఈ యూనివర్శిటీని రాష్ట్రంలో స్థాపించేందుకు సన్నాహాలు జరుగుతుండగా అది ఉత్తరప్రదేశ్‌కు తరలిపోయిందని తెలిపారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో ఈ యూనివర్శిటీ రాష్ట్రానికి రాకుండా పోయిందని ఇప్పుడైనా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి యూనివర్శిటీని కోనసీమలో స్థాపించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 49 ఏళ్లుగా కేజీ బేసిన్ పరిధిలో పలు చమురు సంస్థలు రూ.వేల కోట్ల విలువైన సంపదను, ఆదాయాన్ని దోచుకుపోతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, స్థానిక ప్రజలకు న్యాయబద్ధమైన రాయల్టీ ఇవ్వకుండా సీఎస్ఆర్ పేరుతో అరకొర నిధులు ఇస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల కాలంలో గౌరవ ఉన్నత న్యాయస్థానాలు కూడా కేజీ బేసిన్‌కు తగిన రాయల్టీ ఇవ్వాలని ఆదేశించిన విషయాన్ని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. చెన్నైలో ఉన్న చమురు, సహజ వాయువుల రీజనల్ ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని కోనసీమ జిల్లాకు తరలించాలని డిమాండ్ చేశారు. విశాఖలో సివిల్ ఏవియేషన్ యూనివర్శిటీని స్థాపించాలని, గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ పాల్గొన్నారు.



అమలాపురంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

తహసీల్దార్లు, డీటీల బదిలీలు
అమలాపురం రూరల్: జిల్లాలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ డీఆర్‌ఓ రాజకుమారి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. కాట్రేనికోన తహసీల్దార్‌గా పనిచేస్తున్న పి.సునీల్‌కుమార్‌ను మామిడికుదురు బదిలీ చేశారు. ముమ్మిడివరం తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మిని కాట్రేనికోనకు, కాకినాడ జిల్లా కోటనందూరు తహసీల్దార్ టి.సుభాష్‌ను ముమ్మిడివరానికి, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు కేఆర్‌సీ తహసీల్దార్ విద్యాపతిని అయినవిల్లి మండలానికి, అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మను కలెక్టరేట్‌లో సూపరింటిండెంట్, సమన్వయ విభాగానికి బదిలీ చేశారు. కె.గంగవరం తహసీల్దార్ బి.మృత్యుంజయరావును రామచంద్రపురానికి, కె.గంగవరం డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీరామ్ ప్రసాద్‌ను కె.గంగవరం తహసీల్దార్(ఎఫ్ఏసీ)గా, కలెక్టర్ కార్యాలయంలో డీటీగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న బి. చినబాబును అంబాజీపేటకు బదిలీ చేశారు. సఖినేటిపల్లిలో డీటీగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న భాస్కర్‌ను రాజోలు తహసీల్దార్ గా (ఎఫ్ఏసీ) బదిలీ చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం డిప్యూటీ తహసీల్దార్ కేవీవీ దుర్గాభవానిని కాట్రేనికోన రీ సర్వే విభాగానికి, తూర్పుగోదావరికి చెందిన డిప్యూటీ తహసీల్దార్ జి.రాజశేఖర్‌ను (సెలవులో ఉన్నారు) ఆత్రేయపురం (రీ సర్వే కు) బదిలీ చేశారు.

జగన్ ఒత్తిడితోనే తల్లికి వందనం అమలు
వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

రావులపాలెం: ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై వెన్నుపోటు దినం నిర్వహించి వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ఒత్తిడితో సీఎం చంద్రబాబు తల్లికి వందనం అమలు చేయడానికి ముందుకువచ్చారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఇది వైఎస్సార్ సీపీ సాధించిన తొలి విజయం అని చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలుత అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు పార్టీ తరఫున సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న సర్పంచులను తల్లికి వందనం నుంచి తొలగించడం దారుణం అన్నారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా కూటమి నాయకులు ఉపాధి హామీ కూలీలను తీసుకువచ్చి నిన్న పలు వికృత చేష్టలు చేశారన్నారు. కూటమి నాయకులు పేదవాడి ఇంటికి వెళ్లి రెండు, మూడు నెలలుగా కరెంటు బిల్లులు ఎంత వస్తున్నాయో అడిగి తెలుసుకుని సంబరాలు చేసుకోవాలన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, బీసీ సోదరులకు ఇస్తామన్న పింఛన్ అమలు చేసి అప్పుడు కూటమి నాయకులు సంబరాలు చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలలో అవినీతిలో రెండవ స్థానంలో ఉన్న బండారు సత్యానందరావు మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో బండారు సత్యానందరావు, బండారు శ్రీనివాస్ కలిసి పెట్టిన ఇసుక పిరమిడ్లను చూస్తే ఎవరు అవినీతి చేస్తున్నారన్నది ప్రజలకు తెలుస్తుందన్నారు. బండారు బ్రదర్స్ పెట్టిన ఇసుక పిరమిడ్లు ఎనిమిదో వింత అన్నారు. బెల్ట్ షాపుల్లో వారు వసూలు చేసే బీటాక్స్ గురించి ప్రజలు మాట్లాడుకుంటున్నారని అన్నారు. తనను కమలహాసన్‌తో పోల్చిన బండారు బ్రదర్స్ వారిద్దరూ అవినీతిలో బ్రహ్మానందం, ఆలీలా అని ప్రశ్నించారు. వీరి అవినీతి చికెన్‌షాపుల నుంచి మొదలై మద్యం, రియల్ ఎస్టేట్, ఇసుక కొండల వరకూ చేరిందన్నారు. వీటిపై వాడపల్లి వేంకటేశ్వర స్వామి సాక్షిగా ప్రమాణం చేయగలరా? అని సవాల్ విసిరారు. అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నృత్యాభినయం

- 9 గంటల పాటు పోటీ పడిన కళాకారులు
- కొనసాగుతున్న అంతర్జాతీయ సంగీత ఫెస్ట్
- గోదారి తీరాన రికార్డుల జడి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వంద మయూరాలు పురి విప్పి ఒక్కచోట చేరి నర్తించినట్టు.. రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రం సంగీత నృత్యానంద లహరిలో ఓలలాడింది. సప్త స్వరాల సమ్మేళనంతో వీనుల విందైన గళ మాధుర్యం.. అద్భుత ఆహార్యంతో చూపులు తిప్పుకోలేనంత నేత్రపర్వంగా సాగిన కళాకారుల లాస్య విన్యాసం.. ప్రేక్షకులను, కళాభిమానులను మంత్రముగ్ధుల్ని చేసింది. అంతర్జాతీయ సంగీత ఫెస్ట్–2025లో భాగంగా శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రం ఆధ్వర్యాన రెండో రోజు కళాసమ్మేళన్ వైభవంగా కొనసాగింది. నెమలి నేర్పిన నడకలివీ అన్నట్టుగా.. నృత్య కళాకారులు.. సుస్వర గాత్రంతో గాయకులు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డారు. ఈ సంగీత, నృత్య సంగ్రామంలో ఇరువురూ సమ ఉజ్జీలుగా నిలిచి ప్రేక్షకుల మనసుల్ని దోచారు.

9 గంటల 9 నిమిషాల 9 సెకన్లు

గురువాష్టకంతో పాటు మీనాక్షీ పంచరత్నంలోని శ్లోకాలకు తొమ్మిది మంది గాత్రదానం చేశారు. వారి స్వరాలాపనకు అనుగుణంగా 125 మంది నృత్యకారిణులు పదజతులు కలిపారు. మొత్తం తొమ్మిది గంటల తొమ్మిది నిమిషాల తొమ్మిది సెకన్ల పాటు నిర్విరామంగా సాగిన ఈ అపూర్వ సంగీత, నృత్య సమ్మేళనం అనేక ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ పినాకిల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ దక్కించుకుంది. మరి కొన్ని రికార్డులు కూడా పరిశీలనలో ఉన్నాయి. రెండో రోజు కళా సమ్మేళన్‌ను విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఉదయం ప్రారంభించారు. తొలుత అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికుల ఆత్మశాంతికి కళాకారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సాయంత్రం రుక్మిణీ కల్యాణం నృత్య రూపకం అనంతరం కేరళ సంప్రదాయ నృత్యం మోహినీ అట్టంను చిన్నారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులకు గుంటూరు తాళ్లపాలెంలోని శ్రీ శివక్షేత్రం పీఠాధిపతులు శివస్వామీజీ సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వనాథ్, రోషన్ గుప్తా, చందన్ చౌబే, కుషాల్ భట్టాచార్య (కోల్‌కతా), కృష్ణభగవాన్, పోతిన శ్రీనివాస్ తదితరులను సత్కరించారు.



ఆకట్టుకున్న కళాకారిణుల నృత్యాభినయం



మోహినీ అట్టం అభినయిస్తున్న కళాకారులు



రుక్మిణీ కల్యాణ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,000
గటగట (వెయ్యి)	25,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,000
గటగట (వెయ్యి)	24,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఈటీసీ ప్రిన్సిపాల్‌గా ప్రసాద్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా కేఏస్‌వీ ప్రసాద్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శిక్షణ కేంద్రంలోని మెస్ వివాదంలో చిక్కుకోవడంతో బదిలీ అయ్యారు. దాంతో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జి.రమణ వ్యవహరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా పెద్దాపురంలో డీడీఈఏగా పనిచేస్తున్న ప్రసాద్‌ను విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించింది. దాంతో జిల్లాలోని కొందరు ఎంపీడీఓలతో కలిసి ఆయన విస్తరణ శిక్షణ కేంద్రంకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తరణ శిక్షణ కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. డ్వామా ఏపీడీ మోకా భానుప్రకాష్, డీఎల్‌డీఓ వాసుదేవరావు, డీడీఈఏ శ్యామల, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈటీసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణ, ఫ్యాకల్టీలు పాల్గొని ప్రసాద్‌కు స్వాగతం పలికారు.

రక్తం పంచి..ఆయువు పెంచి..

- ఆపదలో ఆదుకుంటున్న పలువురు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

రాయవరం: రక్తదానం మహోన్నతం. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకున్న వారు ప్రాణ బంధువులే. ఏ బంధం లేకున్నా మానవీయ కోణంలో స్పందించే తీరు ఐక్యతను చాటుతుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారికి, శస్త్ర చికిత్స అవసరమైన వారికి రక్తదానం చేసి ఆదుకున్న వారు ఆప్తులకు మించిన వారుగా చెప్పవచ్చు. రక్తం అవసరం ఉందనే విషయం వాట్సాప్, వివిధ రకాల సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని యువత స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

అన్ని దానాల్లోకెల్లా మిన్న

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని అంటారు. కాని నేడు అదే మాటను అన్ని దానాల్లోకల్లా రక్తదానం మిన్న అని చెప్పుకోవాల్సి వస్తుంది. అన్నదానం చేస్తే ఒక్క పూట కడుపు నిండుతుంది. కాని రక్తదానం చేస్తే..ఒక ప్రాణం నిలబడుతుంది. ఒకప్పుడు రక్తదానం చేస్తే నీరసించి పోతారని, పాడైపోతారనే అపోహలు ప్రజల్లో ఉండేవి. శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంతగా అభివృద్ధి చెందినా కృత్రిమ రక్తాన్ని తయారు చేయలేక పోయారు. రక్తాన్ని కేవలం దానం చేయడం ద్వారా మాత్రమే సేకరించగలుగుతున్నారు. రక్తం అందుబాటులో లేక పలువురు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొంటున్నారు. రక్తం లభ్యమైన సందర్భాల్లో కొందరు ప్రాణాపాయం నుంచి బయట పడిన సందర్భాలు ఉన్నాయి. రక్తదాతలలకు అవగాహన మరింత కల్పించాల్సిన అవసరం ఉంది. రక్తదానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోరాదు. మన శరీరంలో ఐదు లీటర్ల రక్తం ఉంటుంది. రక్తదాన సమయంలో కేవలం **350మిల్లీలీటర్ల రక్తాన్ని మాత్రమే తీసుకుంటారు. అందువల్ల ఎటువంటి హాని కలగదు. రక్తదానం చేస్తే ఇన్ఫెక్షన్స్ వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమే. రక్తదానానికి ఒక గంట సమయం మాత్రమే పడుతుంది. రక్తదానం చేస్తే హిమోగ్లోబిన్ శాతం పడిపోతుందనేది కూడా అపోహే అంటున్నారు వైద్యులు.**

రక్తదానానికి అర్హతలు

- 18 నుంచి 60 ఏళ్ల లోపు స్త్రీ, పురుషులు ఎవరైనా రక్తాన్ని దానం చేయవచ్చు.
- మూడు నెలల వ్యవధితో రక్తదానం చేయవచ్చు.
- రక్తదానం చేయడానికి 12గంటల ముందు తర్వాత ఆల్కహాల్ తీసుకోరాదు.
- రక్తదానం చేసే వారు 45 కేజీల పైబడి బరువును కలిగి ఉండాలి.
- స్త్రీలు రుతుక్రమం సమయంలో, గర్భం ధరించినప్పటి నుంచి బిడ్డకు పాలివ్వడం ఆపేంత వరకు రక్తదానం చేయరాదు.
- రక్తంలో హిమోగ్లోబిన్ కనీసం 12.5 గ్రాములకు తక్కువ కాకుండా ఉండాలి.

రక్తంలో ఏం ఉంటాయి?

రక్తంలో 55శాతం ప్లాస్మా, 45శాతం సెల్స్ ఉంటాయి.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండపేటలో రక్తదానం చేస్తున్న దాత (ఫైల్)

ప్లాస్మాలో 91శాతం నీరు, 8శాతం ఆర్గానిక్ మాలిక్యూల్స్, ఒక శాతం ఇనర్గానిక్ మాలిక్యూల్స్ ఉంటాయి. సెల్స్‌లో తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ఒక మైక్రో లీటరు రక్తంలో 5.6 మిలియన్ల ఎర్ర రక్తకణాలు ఉంటాయి. ఒక మైక్రో లీటరు రక్తంలో 11వేల వరకు తెల్ల రక్తకణాలు ఉంటాయి. ఇవి ఆక్సిజన్ సరఫరాకు తోడ్పడతాయి. తెల్ల రక్తకణాలు శరీరంలో ఉండి రోగకారక క్రిములపై దాడి చేసి రక్షణ కల్పిస్తాయి. 1.5 నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ కణాలు రక్తం గడ్డకట్టడానికి సహకరిస్తాయి.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం, రాజోలులో బ్లడ్ బ్యాంకులున్నాయి. కొత్తపేట, పి.గన్నవరం, మండపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం, ముమ్మిడివరం, అల్లవరం, టి.కొత్తపల్లి పీహెచ్‌సీల్లో బ్లడ్ స్టోరేజ్ సెంటర్లు ఉన్నాయి. ఏడాదికి వలంటీర్ బ్లడ్ డోనర్స్ నుంచి 18వేల యూనిట్ల రక్తాన్ని జిల్లావ్యాప్తంగా సేకరిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మే 31 వరకు 1,093 ప్రసవాలు జరగ్గా 706 సిజేరియన్స్ నిర్వహించారు. వందల సఖ్యంలో మేజర్, మైనర్ శస్త్ర చికిత్సలు చేశారు. ప్రసవాలు, ప్రమాదాలు, అత్యవసర శస్త్ర చికిత్సలు సమయంలో రక్తాన్ని వినియోగిస్తున్నారు. అరుదైన బ్లడ్ గ్రూప్‌ల డోనర్స్ వివరాలను జిల్లా రక్తనిధి కేంద్రం సిబ్బంది సేకరించి, ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో వీరి ద్వారా రక్తాన్ని సేకరిస్తున్నారు. జిల్లాలో రక్త కొరత లేదని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఫర్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ కె.కార్తీక్ తెలిపారు. కళాశాలల్లో విద్యార్థులు, పోలీసు సిబ్బంది, రాజకీయ సంస్థలకు చెందినవారికి రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు.

అరుదైన బ్లడ్ గ్రూపులు

కొందరు అరుదైన బ్లడ్ గ్రూపులు కలిగి ఉంటారు. అటువంటి వారికి రక్తం అవసరమైన సందర్భంలో అదే గ్రూపు రక్తం ఇవ్వాల్సి ఉంటుంది. ఏ, ఏబీ, బీ, ఓ నెగిటివ్ గ్రూపులు అరుదైన గ్రూపులు. ఇటువంటి గ్రూపులకు చెందిన వ్యక్తులు ప్రమాదాలకు గురైనప్పుడు అరుదైన బ్లడ్ గ్రూపుల వారి నుంచి సేకరించిన రక్తాన్నే అందజేయాల్సి ఉంటుంది.

అనర్హులు ఎవరంటే...

సాధారణంగా రక్తదానం శ్వాసకోశ వ్యాధులున్న వారు, క్యాన్సర్, గుండెజబ్బులు, బరువు తగ్గడం, డయాబెటిక్, హెపటైటిస్, ఆస్తమా, ఎపిలెప్సీ, కాలేయ వ్యాధులు, ఎండోక్రైన్ సమస్యలు, ఎయిడ్స్ లక్షణాలు కలిగిన వారు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు రక్తదానం చేయరాదు. మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు చికిత్స పొందిన వారు శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, రక్తదానం పొందిన వారు కనీసం ఏడాది వరకు రక్తదానం చేయడానికి వీలులేదు. దగ్గు, జలుబు, జ్వరం వంటి అస్వస్థత కలిగిన వారు, ఏదైనా చికిత్సలో భాగంగా మందులు వాడుతున్న వారు ఆ విషయాల్ని వైద్యులకు చెబితే వారు ఎప్పటి వరకు రక్తదానం చేయరాదన్న విషయాన్ని చెబుతారు.

23 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నా..



2002 నుంచి రక్తదానం చేస్తూ ఇతరులను ప్రోత్సహిస్తున్నాను. ప్రస్తుతం తూర్పుగోదావరి వలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ పేరుతో రక్తదానం చేస్తున్నాం. ఈ క్లబ్‌లో రోజువారీ కూలీలతో పాటు ఆటోడ్రైవర్లు, పలు వృత్తుల్లో కొనసాగుతున్న 1,500 మంది సభ్యులుగా ఉన్నారు. మా సంస్థ ద్వారా ఇప్పటి వరకు 38 బ్లడ్ క్యాంపుల ద్వారా రక్తాన్ని సేకరించి, రోటరీ, రెడ్‌క్రాస్ వంటి సంస్థలకు అందజేశాం.

– వెలగల ఫణికష్ణారెడ్డి, తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్‌అండ్‌ఐ బ్యాంక్ చైర్మన్, రాయవరం

ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి



ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని ప్రోత్సహించడం వలన ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడిన వారవుతారు. ప్రతి నెలా స్వచ్ఛంధ సంస్థల నుంచి, దాతల నుంచి రక్తాన్ని సేకరించి భద్రపరుస్తాం. అత్యవసర సమయాల్లో అవసరమైన వారికి అందిస్తున్నాం.

– డాక్టర్ పి.అన్నపూర్ణ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (పెథాలజీ), ఏరియా ఆస్పత్రి, అమలాపురం

రోగుల సేవలో తరిస్తూ..

కొత్తపేట: అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ 15 ఏళ్ల ప్రాయం నుంచీ సైకిల్‌పై మొక్కలు వ్యాపారం చేసేవాడు. ఒకసారి కడియపులంక నుంచి మొక్కలు తెచ్చుకుంటుండగా రావులపాలెం వద్ద లారీ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. రక్తస్రావమై ఇబ్బంది పడ్డాడు. కొంత కాలానికి కోలుకుని బతికి బయటపడ్డాడు. తరువాత నుంచి కొత్తపేటలో స్వామి వివేకానంద యోగాశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచీ తాను స్వయంగా 24 సార్లు రక్తదానం చేయగా, తన సంస్థల స్టూడెంట్స్, దాతల సహకారంతో రక్తదానం చేయిస్తున్నారు. రక్తం అవసరమైన రోగుల బంధువులు రక్తం కోసం సంప్రదించినప్పుడు సాధ్యం కాదు అనే మాట రాకుండా రక్తం ఇప్పిస్తున్నారు.

ఇతర జిల్లాలకు సైతం తీసుకువెళ్లి...

స్థానికులకే కాక స్థానికేతర ప్రాంతాలకు, ఇతర జిల్లాలకు సైతం రక్తదాతలను తీసుకువెళ్లి రక్తదానం చేయిస్తున్నారు. కోనసీమ జిల్లాలోని అమలాపురం బ్లడ్ బ్యాంకుల ద్వారా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు కూడా తీసుకువెళ్లి రక్తదానం చేయించి సేవా సంస్థలు, ప్రముఖుల మన్ననలు పొందుతున్నారు.



అమలాపురంలో రక్తదాతలచే రక్తదానం చేయిస్తున్న ఆకుల శ్రీనివాస్

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

అంబాజీపేట: జాతీయ తైక్వాండో పోటీలకు అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ఎంపికైనట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తైక్వాండో కార్యదర్శి బి.అర్జునరావు, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా తైక్వాండో కార్యదర్శి పితాని త్రిమూర్తులు, కోచ్ పితాని భార్గవి శ్రీకళ తెలిపారు. జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం అభినందించారు. ఈ నెల 9 నుంచి 11 వరకు అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన 42వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరిచారన్నారు. సబ్ జూనియర్ విభాగంలో జి.జెస్సీలేఖన, జి.లాహితితేజ, ఎం.టి.ఎస్.లక్ష్మి, క్యాడిట్ విభాగంలో ఎం.మౌనిక, జూనియర్ విభాగంలో పి.ఆదిత్య బంగారు పతకాలను సాధించారన్నారు. ఎం.ఎల్.డి.నూకేష్, పి.ఎల్.ప్రసన్న, దేవకుమార్, ఎ.భార్గవ్, బి.హెచ్.హేమ రిత్విక్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారు. బి.కుసువీరు, జి.పూజితదేవి బ్రాంజ్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నారు. ఈ నెల 20వ తేదీన హరిద్వార్‌లో జరిగే నేషనల్ తైక్వాండో పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు.

జాతీయ రహదారిపై ఆటోను ఢీకొన్న లారీ

- 11 మందికి తీవ్ర గాయాలు
- రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

దేవరపల్లి: జాతీయ రహదారిపై గుండుగొలను–కొవ్వూరు మధ్య శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం రాజమహేంద్రవరంలోని సీతంపేటకు చెందిన 11 మంది ఆటోలో శుక్రవారం తెల్లవారు జామున విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కోసం బయలుదేరారు. దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని 11 మంది తీవ్రంగా గాయపడగా, హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. క్షతగాత్రుల వివరాలు తెలియవలసి ఉంది. గాయపడిన వారిలో పలువురు మహిళలు ఉన్నారు.



క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న
బీఎస్‌ఎఫ్ ఆర్‌ఎస్సైకి సన్మానం

కాకినాడ రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న బీఎస్‌ఎఫ్ ఆర్‌ఎస్సై ఆర్.దేవానందంను కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు, సిబ్బందితో కలిసి సన్మానించారు. ఏపీఎస్పీలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న దేవానందం అల్లుడి ఇంటికి రావడంతో విషయం తెలుసుకున్న కమాండెంట్ నాగేంద్రరావు పిలిపించి సన్మించారు.

దేశానికి సేవ చసిన మహనీయుడిని సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీఎస్‌ఎఫ్ ఆర్‌ఎస్సై దేవానందం మాట్లాడుతూ బీఎస్‌ఎఫ్‌లో 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్నానని, ఆపరేషన్ సిందూర్‌లో తన వంతు పాత్ర పోషించినందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్స్ మోహన్‌రావు, చంద్రశేఖరరావు, రాము పాల్గొన్నారు.



బీఎస్‌ఎఫ్ ఆర్‌ఎస్సై దేవానందంను సత్కరిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

టీడీపీ ఎమ్మెల్యే అనుచరుడిపై పోక్సో కేసు

- బాలికను మోసగించి ముఖం చాటేసిన వైనం
- అబార్షన్ చేయించిన నిందితుడు
- కేసు నమోదు చేసిన బొమ్మూరు పోలీసులు



నిందితుడు సత్యదేవ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ ఎమ్మెల్యే అనుచరుడిపై పోక్సో కేసు నమోదు అయింది. అతను బాలికను గర్భవతిని చేసి ముఖం చాటేశాడు. ఏడు నెలల గర్భవతిగా ఉన్న ఆమెకు అబార్షన్ చేయించిన అతనిపై బాధితురాలు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలతో కలిసి శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెళ్లి చేసుకోమంటే కులం తక్కువ దానివంటూ దూషిస్తున్నాడని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. ఎమ్మెల్యే అనుచరుడు కావడంతో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా పోలీసులు తాత్సారం చేశారని బాధితురాలు ఆరోపించారు. రాజమహేంద్రవరం మోరంపూడి ప్రాంతానికి చెందిన పులపర్తి సత్యదేవ్ 2022 నుంచి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను మోసగించాడు. 2024 నవంబర్ నెలలో బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ బాలిక 6వ నెల గర్భవతి అని నిర్ధారించారు. ఈ మేరకు పులపర్తి సత్యదేవ్ వద్దకు వెళ్లి ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోమని కుటుంబ సభ్యులు అడిగారు. అయితే నేను ఇప్పుడు అయ్యప్పస్వామి మాలలో ఉన్నాను. మాల తీసే లోపు మీ అమ్మాయికి అబార్షన్ చేయించమని కోరాడు. దీంతో 2024 డిసెంబర్ 17న బాలికకు ధవళేశ్వరంలోని ఓ ఆసుపత్రిలో అబార్షన్ చేయించారు. అనంతరం పెళ్లి చేసుకోమని అడుగగా అప్పటి నుంచి సత్యదేవ్ ఆచూకీ తెలియలేదని, ఈ మేరకు న్యాయం చేయాలని బొమ్మూరు పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు తెలిపారు.



బాధితురాలికి న్యాయం చేయాలని తూర్పు జోన్ డీఎస్పీ విద్య, ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథంను కోరుతున్న వైఎస్సార్ సీపీ మహిళానేతలు

బాధితురాలికి న్యాయం చేయండి

గర్భవతిని చేసి అబార్షన్ చేయించిన నిందితుడు పులవర్తి సత్యదేవ్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు మార్తి లక్ష్మి, పోలు విజయలక్ష్మి తదితరులు తూర్పుజోన్ డీఎస్పీ విద్య, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్‌ను కోరారు. బాధితురాలితో కలిసి పోలీసు అధికారులను కలిసి ఆమెకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. రాష్ట్ర తెలికులగాండ్ల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సంకిన భవానిప్రియ, మహిళా నేతలు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతోనే కేసు నమోదు ఆలస్యం : డీఎస్పీ విద్య

మానవతా దృక్పథంతోనే బాధితురాలు కోరిక మేరకు కేసు నమోదు ఆలస్యమైందని తూర్పుజోన్ డీఎస్పీ బి.విద్య అన్నారు. శుక్రవారం బొమ్మూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 4వ తేదీన బాధితురాలు కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. జిల్లా వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ సౌజన్య బాధితురాలిని బొమ్మూరు పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారన్నారు. ఆ సమయంలో ఆమెకు తాను, సౌజన్య కౌన్సెలింగ్ ఇచ్చామని, సత్యదేవ్‌తో తనకు వివాహం జరిపించాలని కోరిందన్నారు. దీంతో సత్యదేవ్‌ను, అతని బాబాయిని పిలిచి మాట్లాడామన్నారు. ఇంట్లో ఒప్పించి పెళ్లి చేసుకుంటానని, పదిరోజులు సమయం కావాలని కోరారన్నారు. పదిరోజులు కుదరదు ఏడురోజులలో విషయం తెలపాలని ఇద్దరికీ చెప్పామన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సత్యదేవ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. అబార్షన్ చేసిన ఆసుపత్రిపై చర్యలు ఉంటాయన్నారు. సత్యదేవ్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ సౌజన్య పాల్గొన్నారు.

క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయంలో చోరీ



ఆలయంలో దొంగతనం వివరాలను తెలుసుకుంటున్న ఎస్సై హరికోటిశాస్త్రి

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ప్రసిద్ధి చెందిన ముక్తికాంత సమేత క్షణ ముక్తేశ్వరస్వామివారి ఆలయంలో దొంగలు పడి స్వామివారి విలువైన అభరణాలను శుక్రవారం చోరీ చేశారు. సీఐ రుద్రరాజు భీమరాజు, స్థానిక ఎస్సై హరికోటి శాస్త్రి, క్రైయిమ్ సిబ్బంది, క్లూస్ బృందం, ఆలయ అర్చకులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం స్వామివారికి నివేదన అనంతరం అర్చకులు ఆలయ తలుపులు మూసి వేశారు. ఈ సమయంలో గుర్తుతెలియని దొంగలు చొరబడి స్వామి వారి ఆలయంలో నిఘా ఏర్పాటు చేసి సీసీ కెమెరాలకు విబూది పూసి స్వామివారి గర్భగుడిలో ఉన్న విగ్రహాలకు అలంకరించిన బంగారు, వెండి అభరణాలు దొంగతనం చేసి పరారయ్యారు. దీనిపై ఆలయ అర్చకులు అయినవిల్లి శివరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు వేలిముద్రలు సేకరించి, ఘటన స్థలాన్ని పరిశీలించారు.

తండ్రి మందలించాడని ఆత్మహత్య

కొత్తపేట: తండ్రి మందలించాడని మనస్తాపంతో ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక ఎస్సై జీ సురేంద్ర శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని పలివెలశేరేపాలెం గ్రామానికి చెందిన తులా రాంబాబు కుమారుడైన సతీష్ (31) గురువారం పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. భోజనం చేస్తున్న సమయంలో పనికి వెళ్లగా వచ్చిన డబ్బు ఇంట్లో ఇవ్వకుండా రోజూ మద్యం తాగుతున్నావని తండ్రి రాంబాబు మందలించాడు. దాంతో మనస్తాపం చెందిన సతీష్ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొంతసేపటి తరువాత గదిలోంచి శబ్దం రావడంతో తండ్రి రాంబాబు కిటికీలోంచి చూడగా మంచంపైన ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని వేళ్లాడుతున్నాడు. స్థానికుల సాయంతో తలుపుతీసి సతీష్‌ను కిందికి దించి చూడగా స్పృహ లో లేకపోవడంతో వెంటనే కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్టు ధ్రువీకరించారు. కాగా సతీష్‌కు వివాహం కాలేదు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.